# చరమలేఖ

'ఇదంతా చూస్తూంటే—ప్రపంచమంతా వట్టిపరిస్థితుల ఉల్టాసీదా మాత్రమేనేమోనని తెలుసుకో గలుగుతున్నాను. ఖానూ!...చిత్ర విచిత్ర సంఘటనలలో నావంటి ఆశాజీవికి తావులేకుండా పాషాణకుడ్యా లమర్చబడతాయి. ఈ నిర్ణయం తోనే నా జీవితయాత్రను అనంత యాత్రగా సాగించడానికి తెరచాప ఎత్తుతున్నాను. అదే నా యీ నిర్ణయతీరం!...

నీకు నా వివాహ శుభలేఖ అందిందో-లేదో తెలియదు. నీవు రాకపోయినా, అథవా ఒక ఉత్తరమైనా వ్రాశావు కాదు కదా!...ఏం చేయను. పోనీ—ఇదే నా శుభలేఖగానో, కడపటి

ప్రణామంగానో, మరే విధంగానో, స్వీకరించి నీహృదయంలో నా కిచ్చిన స్థానాన్ని నా కోసమే ప్రత్యేకించు.

'—' తారీఖున నే ననుకోకుండానే, మా ప్రేమ ఫలితంగా కళ్యాణంవచ్చి మమ్మల్ని సముదాయించింది. నాఉద్యోగం ఝాన్సీకి అనతిదూరానికి ట్రాన్సఫర్ కావడం, నేను వెళ్లిపోవడం—అన్నీ విపరీత వేగంతో త్రోసుకుంటూ వచ్చిపడ్డాయి.

మామూలుగా—నా భార్యను, నాతో పంపమని ప్రాధేయపడ్డాను; "ఏమండీ అత్తగారూ! నా భార్యని తీసుకువెడతా! కొద్ది రోజులలోనే మళ్ళీ వస్తాం..." అన్నాను.

"అబ్బే—అదెలా వీలవుతుంది. పెళ్ళయిన వెంటనే భర్తతో భార్యని పంపిస్తామా? ఇదెక్కడి ఆచారం?" మాట తిప్పింది మా అత్తగారు.

మా అత్తగారిదే ఆ యింటిలోని సర్వపెత్తనమున్నూ. మా బావమరది, నా స్నేహితుడూ శ్రేయోభిలాషీ అయినా—అతనికి మా వివాహాన్ని విజయవంతంగా సాగించేందుకు పొందిన అవకాశమే తన జీవితమంతలోనూ మకుటాయమానం కనుకనే తనేమీ చేయలేకపోయాడు.

"పరిస్థితులన్నీ మాకు తెలిసినవే. నన్నువిడచి, మీ అమ్మాయి శాంత, ఉండలేదు!" ఎలాగో అనగలిగాను...

అప్పటికే ఆవిడ నిర్ణయ తీర్మానానికి వణికిపోతున్న నా పెదవి విప్పి, నాలుకతో సవరించుకొన్నాను.

"ఇదిగో అబ్బాయి! చెబుతున్నా విను. నాటికి లేని వాళ్ళమైనా కులానికి లేనివాళ్ళం కాము. ఆచారాలు, సంప్రదాయమూ తెలుసుకోకుండా నీబోటి దూరభారంనుంచి వచ్చిన మనిషికి మా అమ్మాయినిచ్చి పెళ్ళిచేయడమే నలుగురిలోనూ తలవంపుగా ఉంటోంది. ఇంకానా నాయనా? ఏదో మా అబ్బాయి మాట విని—' అంటూ కరుకుగా సంభాషణ సాగించిందామె.

నన్ను చూచి శాంతా, శాంతని చూచి నేనూ— కళ్ళ నీళ్ళు కుమ్మరించుకోవడం తప్ప, యింక చేయవలసిందేమీ మిగలలేదు.

సరేనని ఆవేళ నా ప్రయాణం ఆపుచేశాను. ఆ రాత్రి మాత్రమే— నా జీవితంలో— ఆఖరిసారిగా స్వర్గ విహారం చేశాను. అదే పై కెగబ్రాకిన నా జీవితంలో ఆఖరి సోపానం! అదే...అదే...

పడకగదిలో నాకోసం శాంత ఎదురుచూస్తోంది. ఆ నిరుపేద యింటిలో పెరిగిన ఆమె సౌందర్యం— ఇంత సంస్కారం ఏవిధంగా కలిగించుకుందో నేను చెప్పలేను... తెల్లని దంతపు బొమ్మకు కుందనపు తళుకు లద్దినట్లుగా మెరిసే ఆమె శరీరానికి ఏం సువాసన లద్దుకుందో ఏమో కార్తీకపౌర్ణమిలా

ప్రకాశించిందామె! ఆ నుదుటిలోని పెంకితనం, కన్నులలోని బేలతనం, ఒకదాన్ని ఒకటి ఎకసక్కేలాడుకుంటాయి.

నేను రాగానే ఆముదందీపం ఎగసన్రోసింది. జాళువా తళుకులతో మెరిసే ఆమె పళ్ళూ, చీకటిలోసైతం మెరిసే కళ్లూ, ఇక నాకెప్పుడూ కన్పించవు కాబోలు! అథవా ఇంకో లోకంలోనైనా...? ఏమో!

చప్పున నా దగ్గరగావచ్చి, ముఖం ఎత్తి 'రేపు...వెళ్లి పోతారా?...మా అమ్మ నన్ను పంపనంటోంది కదూ?' ఇంక మాట్లాడలేకపోయింది. కళ్ళు చెమ్మగిల్లి పై రెప్పల్ని తడుపుతున్నాయి.

"శాంతా! ఏమీ విచారించకు, త్వరలోనే మళ్ళీ వస్తాగా!...నా ఉద్యోగం ట్రాన్సఫర్ చేయించుకుంటాలే, ఈ ఊరికే మళ్ళీ!"

ఏవేవో చాలాసేపటివరకూ మాట్లాడుకున్నాం. ఎన్నో విధాల ఆమెను బుజ్జగించాను. ఏమనుకుందో, ఏమోగాని ఇక ఏడవటం మానింది.

త్వరత్వరగా ఎగించి వస్తూన్న శ్వాసలో ఆమె వక్షం కదులుతూ వింతగా ఊగుతోంది, మధ్యనున్న పైట ఊయాల లూగుతూ మౌనస్వరాలతో ఏ అతీత సందేశాలనో నాకు వ్యక్తం చేస్తోంది...

పైట చూరునుంచి జారే వెన్నెల-జాజిపూల పొత్తిళ్ళల్లో పడి మెత్తగా సర్దుకొని నిద్దరోతోంది. వెన్నెల నీడలు దిగులుగా అంపకపుతల్లి చల్లని చేతులవలె మాకేసి చూస్తున్నాయి.

—శాంత హృదయంలో ఎన్నో యుగాలనుంచి తపస్సు చేస్తున్న అశాంతి మాయమై కనురెప్పలు జారి, అమాయకంగా హాయిగా కంటిపాప నదుముకొనే సరికి — నాలోని పురుషు లెంతమందో నశించినట్టుగా తోచింది నాకు. నుదుటిమీదికి ఉబికిన చెమటబిందువులు ముంగురులను గట్టిగా పట్టుకొన్నాయి వంపు వంపులుగా ప్రక్కకు ఒత్తిగిలి, నా జెబ్బనానుకొని శాంత హాయిగా పవళించింది.

‘శాంతా...!’

—శ్రమించిన నా హృదయంనుంచి, ఏదో దివ్యశక్తి వెలువడి—ఆమె చెవిలోకి ఈ మాటగా ప్రవేశించింది.

“ఊఁ...!”

—బద్ధకంగా, బరువుగా, ఇబ్బందిగా అన్నదామె.

“నిద్దరా...?”

మాట్లాడకుండా నా వైపు తిరిగి, చేతితో నాకంఠాన్ని గట్టిగా బిగించి, పెదాలతో నా శ్వాస నిలిపి వేసింది. నాలో మూర్ఛిల్లిన శక్తులకు సంజీవి పోసినట్లయింది.

"ఇలాగే మనం, తిండీ తిప్పల అవసరం లేకుండా—కొన్ని యుగాలుండిపో గలిగితే...!"

ఆమె మాట్లాడలేదు.

ముకుళితమయ్యే పద్మాలను జ్ఞప్తికి తెచ్చాయి శాంత కళ్ళు.

మరునాడే నా ఉద్యోగంలోకి చేరుకోవాలి కనక, విశ్వప్రయత్నంతో ఝూన్సీ వదిలాను. నా హృదయంలోనో ...మరి ఎక్కడో శాంత ముంగురులు హాయిగా ఊగులాడు తూనే ఉన్నాయి...

ఝూన్సీకి బదిలీచేయమని మా మేనేజరును కాళ్ళా వేళ్ళాపడి బ్రతిమాలాను. కాని అతని ప్రయత్నానికి, నా విముక్తికీ సరైన ఫలితం కనిపించలేదు.

మరో మూడురోజులు— మొరోజుగా అన్నపానాలు మాని నన్ను తొక్కుకుంటూ నడిచిపోయాయి. మూడో రోజుకే నాకు శాంతినుంచి ఉత్తరమూ, పేపర్లో వార్తా కని పించాయి...

"ప్రియమైన...

మీకు అవకాశం లభించలేదని అర్థమైంది. మీకు బదిలీ కాదని తెలుసుకున్నాను...నా తల్లి సర్పదంతాల్లోంచి విడివడే మార్గం ఇదేనని నిశ్చయమైంది...

నా కోసం కాకపోయినా... మీ కోసమైనా హాయిగా ఉండండి. దిగులు వద్దు...మీ...”

ఇంక అవసరం లేదనుకుంటాను. విషయాలు బోధ పడ్డాయికదూ? మీ పేపర్లు కూడా బహుశా ఈ వార్తను ప్రకటించే ఉంటాయి—అవునా! ఈ విషయం ఎవ్వరూ నమ్మే సామాన్య విషయం కాకపోవచ్చు. ఎంతమంది ఇంతకన్న వియోగం భరిస్తున్నా ఎంతమంది స్త్రీ పురుషులు ఆదమరచి బ్రతకటంలేదూ? అని ప్రతివాడూ ప్రశ్నించుకోవచ్చు, కాని ఇక్కడి పత్రికలు ప్రకటించిన వాస్తవ కథనమిది... “భర్త వియోగం భరించలేక ఒక యువతి ప్రాణాలు తీసుకుంది...” ఈ మాత్రమేనా మీ పత్రికలు ప్రకటించలేదా?

అయ్యో! ఇంకెవరనుకున్నావ్?— నా శాంత! నా జీవితాన్ని కాల్చి, వెలిగించి కాస్త బూడిద తన పైట చెంగులో కట్టుకొని వెళ్ళిపోయిన శాంత! ఇక రెండు నిమిషాల్లో తన వెనుకే నన్ను తీసుకుపోతూన్న శాంత!...

మా కథ నీకు తెలియదు... ఎవరికీ తెలియదు. తెలియాల్సిన అవసరంలేదు కూడాను. నీ బాల్యమిత్రుడు వేణు నీకింక కనిపించడు...ఒక్క శాంతకు తప్ప మరెవ్వరికీ కనిపించడులే, వాసూ! మరో చిరస్వాప్నిక సుదూరలోకాలకు శాంత చెంగుపట్టుకొని ప్రయాణం సాగిస్తున్నాడు.

"వాసూ! నీకోసమూ, వృద్ధులై తెలుగు నేలలో కలలు కనే తల్లిదండ్రులకోసమూ— భారంగా బ్రతకగలనా?"

"శాంతా! ఇక్కడ ఉండలేనబ్బా!... కాస్త ఆగు; నేనూ వస్తున్నానుగా!"

ఇదే నా తుది నిర్ణయం... రేపు నా గదిని పోలీసులు సోదా చేస్తారు. నా స్థూల దేహాన్ని పంచాయితీ చేస్తారు. నన్ను కోస్తారు, నీచులు తెలుసుకుంటారు! మా అత్తగారి ఆచారాలూ, అహంభావమూ, మచ్చలేని సాంప్రదాయమూ, బాగా శాంతి పొందుతాయి.

వాసూ! నన్ను చూడలేవు...నీవూ నీ కనకం సుఖంగా బ్రతకండి. సత్యమూ మా ఆశీస్సులు పొందండి... ★

[1944లో జూన్ 21వ తేదీన ఆంధ్రపత్రికలో పడిన బొక్సు వార్త—అప్పట్లో ఈ కథకు ఆధారభూతమైంది.]

ప్రచురణ – ప్రజావాణి, ఏప్రిల్ 11, 1954